సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ׀ 4 ׀ సెప్టెంబర్ ׀ 2024



20,370 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి 20,370 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 700, కావలి కాలువకు 350, ఉత్తరకాలువకు 5, దక్షిణకాలువకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం మంగళవారానికి 40.699 టీఎంసీలకు చేరుకుంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,770
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,682
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,882
నవర (8 గ్రాములు)	రూ.55,056

గరిష్టం/కనిష్టం 35.8 /26.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం బుధవారం తేమగా ఉండి అక్కడక్కడ జల్లులు పడవచ్చని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 56 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

గిరిజన సంక్షేమ సబ్‌ప్లాన్‌ను అమలు చేయండి

- ఎస్టీల ఆర్థిక పరిపుష్టికి ప్రాధాన్యత
- కలెక్టర్ ఓ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో 2024–25 గిరిజన సంక్షేమ సబ్‌ప్లాన్‌ను పక్కాగా అమలు చేసేందుకు ఆయా శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఆయా శాఖల వారీగా పొందుపరచాల్సిన నివేదికపై కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్టీల పరిపుష్టి కోసం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఆయా శాఖల్లో కేటాయింపులు చేయాలని సూచించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎస్టీలకు ప్రయోజనాలు సమకూర్చడం, ఎస్టీల హేబిటేషన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తూ ఎస్టీల ఆర్థిక బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు, తాగునీరు, విద్య, ఉపాధి కల్పన మొదలైన అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా డ్వామా, డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఆర్ అండ్‌బీ, పశు సంవర్ధక, వ్యవసాయ, ఉద్యాన శాఖ, ఐసీడీఎస్ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాల్లో ఎస్టీలకు అధికంగా ప్రయోజనం కల్పించేలా సబ్ ప్లాన్‌ను రూపొందించాలని సూచించారు. ఆయా శాఖల్లో కేటాయింపులతో పాటు గిరిజన సంక్షేమశాఖ ద్వారా మంజూరు చేసిన కేటాయింపులతో ఎస్టీల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. మూడు రోజుల్లో సబ్ ప్లాన్‌కు సంబంధించి నివేదికను తయారు చేసి ఐటీడీఏ అధికారులకు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ పరిమళ, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్, హౌసింగ్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు సాంబశివారెడ్డి, శ్రీనివాసులు, దయాకర్, రవీంద్ర, జిల్లా వ్యవసాయ శాఖాధికారి సత్యవాణి, ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల ఎస్‌ఈలు గంగాధర్, విజయన్, సీపీఓ రాజు, డీఈఓ రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆట్యాపాట్యా జిల్లా జట్ల ఎంపికలు 8న

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఆట్యాపాట్యా జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలను ఈ నెల 8న నగరంలోని బీవీఎస్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి కె.కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14వ తేదీ నుంచి కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 94935 82143 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేపు విద్యుత్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): ఏపీ ట్రాన్స్‌కోలో ఇంటర్ సర్కిల్ షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామి వేలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పొదలకూరురోడ్డులోని నెల్లూరు క్లబ్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యుత్ సంస్థలో పనిచేసే ఉద్యోగులకు 5వ తేదీ ఉదయం 9 గంటలకు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని బ్యాడ్మింటన్ (మై డ్రీమ్ క్లబ్)లో సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు విద్యుత్ భవన్‌లో టెన్నిస్ పోటీలకు సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహిస్తారన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, లైన్‌మెన్ గ్రేడ్–2 కార్మికులు సెలక్షన్స్‌లో పాల్గొన్నాలని కోరారు.

విజయవాడకు ఆహార పొట్లాలు



విజయవాడకు కంటైనర్‌లో ఆహార పొట్లాలు తరలిస్తున్న సిబ్బంది

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎస్‌ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో విజయవాడలోని వరద బాధితులకు మంగళవారం ఆహార పొట్లాలను తరలించారు. ప్రత్యేక వాహనాల్లో 38,185 ఆహార పొట్లాలను మూడు కంటైనర్ల ద్వారా పంపినట్లు డీఎస్‌ఓ తెలిపారు.

ప్రాక్టికల్స్‌కు ప్రైవేటు



కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిపోతోంది. మొదటి నుంచి విద్యా వ్యవస్థపై చిన్నచూపు ఉన్న ప్రభుత్వ పెద్దలు.. అధికారం చేతిలోకి రాగానే నిర్లక్ష్యం చేస్తున్నారు. అత్యధికంగా నారాయణ కళాశాలలు ఉండడంతో విద్యా విధానాలను కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యానికి వదిలేశారు. 'రౌతు మెత్తన అయితే.. గుర్రం మూడు కాళ్ల మీద పరుగెడుతుందనే' సామెత చందానా సదరు యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. సాక్షాత్తు సీఎం తనయుడు మంత్రిగా వెలగబెడుతున్న విద్యాశాఖ ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్‌కే కళాశాలల యాజమాన్యాలు తూట్లు పొడిచాయంటే ఆ శాఖ పనితీరును తేటతెల్లం చేస్తున్నాయి.

- ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచే ప్రాక్టికల్స్
- వారంలో ఒక సబ్జెక్ట్ రెండు క్లాసులు
- ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్ట్‌లకు ప్రాక్టికల్స్
- వారానికి బైపీసీకి 8, ఎంపీసీకి 4 పీరియడ్లు తప్పనిసరి
- ప్రైవేట్ కళాశాలల్లో బూజు దులపని ల్యాబ్‌లు
- కొన్ని కళాశాలల్లో ల్యాబ్‌లే లేని పరిస్థితి
- ప్రైవేట్ కళాశాలల ఇష్టారాజ్యం

తనిఖీలు జోలికి వెళ్లని ఇంటర్ బోర్డు అధికారులు



ప్రాక్టికల్స్ పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఆర్‌ఐఓ శ్రీనివాసులు (ఫైల్)

నెల్లూరు (టౌన్): జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల నిర్వహణ ఆయా యాజమాన్యాల ఇష్టారాజ్యంగా మారింది. రాష్ట్ర ఇంటర్ బోర్డు విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యార్థులకు బోధించాల్సిన పాఠ్యాంశాలు, సిలబస్, ప్రాక్టికల్స్‌ను పాతరేశాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో అడ్డదారుల్లో మార్కులు.. ర్యాంక్‌లు తెచ్చుకునే వెసులుబాటుకు అలవాటు పడిన ప్రైవేట్ యాజమాన్యాలు ప్రాక్టికల్స్ పీరియడ్స్‌కు మంగళం పాడేశాయి. కళాశాలలు తెరిచి మూడు నెలలు దాటింది. ఈ రోజుకు ఒక్క ప్రయోగం కూడా నిర్వహించని పరిస్థితి కనిపిస్తోంది. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం వారానికి తప్పని సరిగా ఒక్కో సబ్జెక్ట్‌కు 2 క్లాసులు ప్రాక్టికల్ కోసం నిర్వహించాల్సి ఉంది. వీటిని నిర్వహించకపోయినా.. జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ యాజమాన్యాల అడుగులకు మడుగులొత్తుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ప్రాక్టికల్స్ పరీక్షల కోసం ఆయా యాజమాన్యాల విద్యార్థుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ప్రభుత్వ కళాశాలల్లో అరకొర..

జిల్లాలో మొత్తం 185 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రభుత్వ యాజమాన్యాలకు సంబంధించి 66, కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 119 ఉన్నాయి. ఇందులో ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 19,998 మంది, బైపీసీలో 3,613 మంది, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 17,684 మంది, బైపీసీలో 2,967 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రథమ సంవత్సరం నుంచే ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో అయితే అరకొరగా ప్రాక్టికల్స్ జరుగుతుండగా, ప్రైవేట్ కళాశాలల్లో అయితే ఆ ఊసే కనిపించడం లేదు. ఆయా కళాశాలల్లో ప్రాక్టికల్స్‌కు ల్యాబ్‌లు మచ్చుకైనా కనిపించవు. ల్యాబ్‌లు, అందులో ఉన్న పరికరాలకు ఇంకా బూజు కూడా దులపని పరిస్థితి ఉంది. ప్రధానంగా జిల్లాలో నారాయణ, శ్రీచైతన్య యాజమాన్యాలు బ్రాంచ్‌ల పేరుతో పెద్ద మొత్తంలో కళాశాలలను నిర్వహిస్తున్నాయి. మెజార్టీ బ్రాంచ్‌ల్లో ప్రయోగ శాలలు లేవని తెలిసింది.

ముడుపులతో మౌనం

ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్, తరగతులు, పరీక్షలు నిర్వహణపై జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు ముడుపులు తీసుకుని తనిఖీలు చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యాజమాన్యాలు ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలో విద్యార్థి నుంచి రూ.300 నుంచి రూ.400 వసూలు చేస్తారు. ప్రాక్టికల్స్ జరిగే కేంద్రాలకు వచ్చే ఎగ్జామినర్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను ఆ డబ్బులతో మేనేజ్ చేస్తుంటారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రధానంగా నారాయణ, శ్రీచైతన్య తదితర జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ తరహాలోనే వ్యవహరిస్తుంటాయనేది బహిరంగ విషయం.

నెలకు ఎంపీసీకి 32, బైపీసీకి 16 తరగతులు

ఇంటర్ బోర్డు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు బైపీసీ, ఎంపీసీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లకు సంబంధించి వారానికి రెండు క్లాసులు.. అంటే 4 సబ్జెక్ట్‌లకు 8 క్లాసులు నిర్వహించాలి. ఈ లెక్కన నెలకు బైపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీలకు సంబంధించి 32, ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీకు సంబంధించి 16 పీరియడ్స్ నిర్వహించాలి. ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్స్ అంటేనే తెలియదు. ద్వితీయ సంవత్సరంలో కూడా కొన్ని కళాశాలల్లో మాత్రం హడావుడిగా పరీక్షలకు 15 రోజుల ముందు తీసుకెళ్లి ల్యాబ్‌ను, రసాయనాలను పరిచయం చేస్తారు. మరికొన్ని కళాశాలల్లో ల్యాబ్, రసాయనాలు ఖర్చుతో కూడుకున్న పని కావడంతో వాటి జోలికి వెళ్లడం లేదని తెలిసింది. ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలో మేనేజ్ చేయొచ్చన్న ఆలోచనలో ఉన్నారన్న విమర్శలు ఉన్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో తప్పనిసరిగా ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించాలని ఇప్పటికే ఆయా యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశాం. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించాలి. ఈ వారంలో ఆయా కళాశాలలకు వెళ్లి తనిఖీలు చేస్తాం. విద్యార్థులను అడిగి వివరాలు తీసుకుని ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించని కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, ఆర్‌ఐఓ

హద్దుమీరి ప్రవర్తించొద్దు

- రేపటి రోజున పరిణామాలు తీవ్రంగా ఉంటాయి
- పోలీస్, రెవెన్యూ అధికారులది అత్యుత్సాహం
- సీనియర్ సిటిజన్ ఇంట్లో సోదాలు చట్టవిరుద్ధం
- అధికారులపై కేసులు పెట్టకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- పరాకాష్టకు చేరిన కూటమి ప్రభుత్వ దుర్మార్గాలు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: కూటమి ప్రభుత్వం దుర్మార్గపు చర్యలు పరాకాష్టకు చేరాయి. పోలీస్, రెవెన్యూ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి హద్దుమీరితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. రేపటి రోజు మీ ఉద్యోగ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రవర్తించండి అంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఏ అధికారంతో సీనియర్ సిటిజన్ ఇంట్లో సోదాలు చేస్తారంటూ నిలదీసిన కాకాణి, సంబంధిత ఉద్యోగులపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఆందోళనకు దిగారు. మండలంలోని మరుపూరు గ్రామ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ సర్పంచ్ వక్లూరు గోపాల్‌రెడ్డి ఇంట్లో సోమవారం సాయంత్రం రెవెన్యూ, పోలీసు అధికారులు ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు చేయడంపై కాకాణి పోలీస్, రెవెన్యూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఇంట్లో అనుమతి లేకుండా సోదాలు చేసిన డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు, ఏఎస్సై, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలంటూ గోపాల్‌రెడ్డి ఎస్సై హనీఫ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాకాణి మీడియాతో మాట్లాడుతూ ఎస్సై, సీఐ, తహసీల్దార్లకు సెర్చ్ వారెంట్ ఇచ్చే అధికారం లేదన్నారు. జిల్లా కలెక్టర్, జడ్జిలకు మాత్రమే సెర్చ్ వారెంట్ ఆదేశాలు ఇచ్చే అధికారం ఉందన్నారు. గ్రీవెన్స్ సెల్లో ఎవరో గోపాల్‌రెడ్డిపై అర్జీ ఇస్తే ఆయన ఇంట్లో అసైన్‌మెంట్ పట్టాలు ఉన్నాయని డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు, ఏఎస్సై, కానిస్టేబుళ్లకు సోదాలు చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. గోపాల్‌రెడ్డి సీనియర్ సిటిజనే కాక మూడు పర్యాయాలు సర్పంచ్‌గా, గ్రామ మున్సుబుగా పనిచేసి గౌరవ ప్రదంగా జీవిస్తున్నారని తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లతో ప్రభుత్వ ఉద్యోగులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ హద్దుమీరి అతిగా ప్రవర్తిస్తే తర్వాత పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సోదాల్లో ఏమైనా ఆధారాలు లభ్యమయ్యాయా? అని నిలదీశారు. అక్రమ సోదాలతో గౌరవప్రదమైన కుటుంబాన్ని వీధుల్లో పెట్టాలని చూస్తే సహించబోమన్నారు. ఇక్కడ ఇండియన్ పీనల్ కోడ్‌కు బదులు సోమిరెడ్డి పీనల్ కోడ్‌ను అమలు చేయాలని చూస్తున్నారన్నారు. తాము సోదాలు, కేసులకు భయపడే రకం కాదని, న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టవ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడే అధికారుల ఉద్యోగాలను ఊడగొట్టిస్తామన్నారు. తహసీల్దార్ మలిశెట్టి సారంగపాణి, ఎస్సై హనీఫ్, సీఐ రాంబాబు ఎవరి ఒత్తిడితో తమ సిబ్బందిని గోపాల్‌రెడ్డి ఇంటికి పంపారో చెప్పాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ గణేష్, వీఆర్వోలు పేరయ్య, మాలకొండయ్య, ఏఎస్సై ముజీర్‌బాషా, కానిస్టేబుళ్ల రసూల్, మదన్‌పై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకుంటే ప్రైవేట్ కేసు పెట్టడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, పోలీస్‌స్టేషన్లు టీడీపీ కార్యాలయాలుగా మారిపోతున్నాయని చెప్పారు. రైతులు సాగు చేసుకుంటున్న భూముల జోలికి వెళ్లి వారు ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నట్లు తెలిపారు. కొత్త ప్రభుత్వంలో మార్పు వస్తుందని కొద్ది రోజులు వేచి చూసినా ఫలితం లేదన్నారు. కనుకనే అధికారులతో మాట్లాడడమే మానివేశామన్నారు. తాను పదేళ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశానని ఎవరి ఇంటి మీదకైనా సోదాలకు పంపామా? అని ప్రశ్నించారు. అధికారులు సోమిరెడ్డి మాటలు విని అక్రమ కేసులు, సోదాలకు పాల్పడితే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా స్టేషన్‌కు వెళ్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

దొంగల పాపం.. రైతుకు శాపం..!

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే రాగి తీగ కోసం దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మెట్ట ప్రాంతంలో తరుచుగా జరిగే ఇలాంటి దొంగతనాల వల్ల సాగులో ఉన్న పంటలకు నీటిని పెట్టుకోలేక రైతులు లక్షలాది రూపాయల పంటను కోల్పోవాల్సి వస్తోంది.



- తరచుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీలు
- కొత్తవి ఏర్పాటు చేయడంలో సాంకేతిక చిక్కులు
- ఎఫ్‌ఐఆర్ కాపీ ఉంటేనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- కానీ కేసు నమోదులో పోలీసుల విపరీత జాప్యం
- దీంతో పంటలకు నీరందక భారీగా నష్టపోతున్న రైతులు



ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగివైరు తస్కరించిన దృశ్యం

పొదలకూరు: ఉద్యాన సాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పంటలకు నీటిని పెట్టుకునేందుకు రైతులు విద్యుత్ మోటార్లపైనే ఆధారపడుతుంటారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగితే దాని స్థానంలో కొత్తది బిగించేందుకు ఎక్కువ సమయం పడుతోంది. ఎందువల్లనంటే.. ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగినప్పుడు రైతులు వెళ్లి విద్యుత్ అధికారులకు సమాచారం అందజేస్తే వారు వెళ్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. పోలీసులు కేసు నమోదు చేసి ఎఫ్‌ఐఆర్ కాపీని అందజేస్తే చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తారు. అయితే విద్యుత్ అధికారులు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయడంలో విపరీత జాప్యం చేస్తున్నారని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

దొంగల ముఠా ఏం చేస్తోందంటే..

ట్రాన్స్‌ఫార్మర్లను స్తంభం నుంచి తొలగించి దానిని పగులగొట్టి అందులో ఉన్న రాగి తీగను దొంగిలిస్తోంది. సహజంగా ఇలాంటి పనులు చేయాలంటే విద్యుత్ పనులు తెలిసినవారై ఉండాలి. ఇలాంటి చోరీల ముఠాలో విద్యుత్ పనులు తెలిసిన వారు ఒకరుంటారనేది గతంలో పట్టుబడిన దొంగల ద్వారా తెలిసింది. వీరు పగటి వేళల్లో తిరుగుతూ రాత్రి వేళల్లో అనువైన ప్రదేశాల్లో దొంగతనాలకు పాల్పడుతుంటారు. పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి వైరు వేరు చేసి అపహరించే క్రమంలో మిగిలిన పరికరాలను అక్కడే పడేసి వెళుతుంటారు. గతంలో పెద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న సమయంలో రాగివైరు దొంగిలిస్తే అధిక మొత్తంలో నగదు వచ్చేది. అయితే ఇప్పుడు రైతుల తోటల్లోనే చిన్న ట్రాన్స్‌ఫార్మర్లు (హెచ్‌వీడీఎస్) ఇద్దరు లేదా ముగ్గురు రైతులకు కలిపి ఏర్పాటు చేస్తున్నారు. దీంతో చోరులు వరుసగా రెండు లేదా మూడు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొడుతున్నారు. ఈ తరహా చోరీలు పొదలకూరు ప్రాంతంలో రెండు దశాబ్దాలుగా జరుగుతున్నాయి. ఏకంగా విద్యుత్ స్తంభాల తీగలనే కట్‌చేసి అపహరించుకు వెళ్లిన ఘటనలు కూడా ఉన్నాయి. అప్పట్లో పోలీసులు ఈ దొంగలముఠా గుట్టురట్టు చేసి జైలుకు కూడా పంపారు. ఏడాదికాలంలోనే పొదలకూరు పరిసర ప్రాంతాల్లో 23 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఇందులో 14 ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ అధికారులు తిరిగి బిగించగలిగారు. మిగిలినవి సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరుగుతున్నట్టు తెలుస్తోంది.

జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు

2023లో	2024లో
చోరీకి గురైనవి 35	చోరీకి గురైనవి 23
విద్యుత్ విజిలెన్స్ రికవరీ చేసినవి 21	రికవరీ చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు 19

గతంలో రైతుకమిటీలు ఉండేవి

చిన్న ట్రాన్స్‌ఫార్మర్లు రాక ముందు రైతుల వ్యవసాయ విద్యుత్ అవసరాల కోసం అధికారులు 60, 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేవారు. వీటి కింద విద్యుత్ కనెక్షన్ పొందే రైతులను కమిటీగా ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్ బాధ్యతలను వారికి అప్పగించేవారు. అలాంటి విధానం ఆచరణలో కొంత వైఫల్యం చెందినా రైతుల్లో కొంత బాధ్యతను పెంచేవిధంగా ఉండేది. రైతులు తరచుగా ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తూ ఉండేవారు. చోరీకి గురైన వెంటనే ఎక్కువ మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉండేవారు కనుక అధికారులపై ఒత్తిడి కూడా పెరిగేది. హెచ్‌వీడీఎస్ చిన్న ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చిన తర్వాత రైతు కమిటీలు లేకుండాపోయాయి.


చోరీ జరిగితే రైతులకు ఇబ్బంది



ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగితే రైతుల ఇబ్బంది వర్ణనాతీతం. ఇటీవల మా గ్రామానికి వెళ్లే రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం జరిగింది. తర్వాత రెండో పర్యాయం చోరీ చేసే ప్రయత్నం జరగ్గా పోలీసులు అప్రమత్తం అయ్యారు. తిరిగి ట్రాన్స్‌ఫార్మర్ బిగించేందుకు సమయం పడుతున్న నేపథ్యంలో రైతులు బాగా సమస్యలు ఎదుర్కొంటున్నారు.

– ఎం.శంకర్‌రెడ్డి, రైతు, ముదిగేడు

నిమ్మతోటల రైతులకు సమస్య



గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం జరిగితే రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వేసవి కాలంలో అయితే నిమ్మతోటలకు నీరు పెట్టుకునేందుకు విద్యుత్ లేకపోతే చెట్లు ఎండుముఖం పడతాయి. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలంటే అధికారులకు నిబంధనలు ఉన్న కారణంగా రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– ఎ.గంగిరెడ్డి, రైతు, మొగళ్లూరు

చోరీలు జరిగిన వెంటనే చర్యలు

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ జరిగిన వెంటనే రైతుల ద్వారా సమాచారం తెలుసుకుని చర్యలు చేపడుతున్నాం. ఏఈ స్థాయి అధికారి ద్వారా పోలీస్‌స్టేషన్లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నాం. అయితే ఎఫ్‌ఐఆర్ కాపీ లేకుండా చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది బిగించడం వీలుకాదు. మండలంలో ఇదే తరహాలో 14 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

– బి.సురేంద్రబాబు, ఏడీఈ, పొదలకూరు

క్లుప్తంగా

ఎఫ్సీ లేకపోతే చర్యలు



అపస్మా నేతలతో డీటీసీ సమావేశం

నెల్లూరు (టౌన్): విద్యాసంస్థల బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్సీ) లేకుండా రోడ్డెక్కితే కఠిన చర్యలు తప్పవని ఉప రవాణా కమిషనర్ చందర్ స్పష్టం చేశారు. బీవీనగర్‌లోని రవాణా కార్యాలయంలో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య అసోసియేషన్ (అపస్మా) నేతలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంబంధిత భద్రత నియమావళిని పాఠశాలల బస్సులు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. లైసెన్స్ లేకుండా బస్సులను నడిపితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విద్యార్థులకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించడంతో పాటు బస్సు భద్రతను పర్యవేక్షించడంలో యాజమాన్యాలు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, అపస్మా నేతలు రామ్మోహన్‌రెడ్డి, వెంకటాద్రి, వెంకటేశ్వరరెడ్డి, అభిషేక్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుచికర భోజనాన్ని అందించండి

- కలెక్టర్ ఆనంద్



నెల్లూరు(దర్గామిట్ట): డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో భాగంగా జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. మధ్యాహ్న బడి భోజన కార్యక్రమం అమలుపై ఎంఈఓలు, పాఠశాల తల్లుల కమిటీ చైర్‌పర్సన్లు, కుకింగ్ ఏజెన్సీలకు వర్క్‌షాపును కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని 2570 పాఠశాలల్లో 1,66,056 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని అందుకుంటున్నారని చెప్పారు. దీని ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని కోరారు. జిల్లాలో స్థానిక పరిస్థితుల బట్టి ఆహార మెనూలో మార్పులు చేయాలని సూచించారు. డీఈఓ రామారావు, అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విజిలెన్స్ ఏఈ తనిఖీలు




సోమశిల: మండల పరిధిలోని సోమశిల, మంచాలపల్లి, వరికుంటపాడు, అనంతసాగరం గ్రామాల్లో గల జగనన్న కాలనీలను విజిలెన్స్ ఏఈ వెంకటరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను స్వయంగా తనిఖీ చేసి లబ్ధిదారులు సొంతంగా ఇల్లు కడుతున్నారా, లేక ఇతరులకు విక్రయించారాననే అంశాన్ని పరిశీలించామని చెప్పారు. క్రమ పద్ధతితో నిర్మిస్తే వాటికి బిల్లులను సక్రమంగా అందిస్తామని తెలిపారు. హౌసింగ్ డీఈ ముక్తార్‌బాషా, ఏఈ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఏరేటర్ చోరీ

ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో గల చేపల చెరువులో ఏర్పాటు చేసిన ఏరేటర్, గేర్‌బాక్సును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఘటనపై బాధితుడు బత్తిన సుమన్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వీటి విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా కొమరిక పక్కనే గల టీపీ కండ్రిగలో రైతులకు సంబంధించిన రెండు విద్యుత్ మోటార్లు ఇటీవల చోరీకి గురయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.102
లేయర్	: రూ.105
బ్రాయిలర్ చికెన్	: రూ.190
స్కిన్‌లెస్ చికెన్	: రూ.210
లేయర్ చికెన్	: రూ.178

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30

టీడీపీ నేతల గ్రావెల్ దోపిడీ

- కొత్తపల్లి చెరువులో యథేచ్ఛగా తవ్వకాలు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలిలో టీడీపీ నేతలు దందాలు చేస్తూ ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. కావలి మండలం కొత్తపల్లిలోని చెరువులో గ్రావెల్‌ను అక్రమంగా తరలించి అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కొత్తపల్లి చెరువులో 200 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకునేందుకు రూ.30 వేలను చెల్లించారు. అయితే వేలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. చెరువులో మోటార్లు పెట్టి పైప్‌ల ద్వారా నీటిని పక్కకు మళ్లిస్తూ, రాకపోకలకు అవసరమైన రోడ్డును ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా గ్రావెల్ దందాను కొనసాగిస్తున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లను పెద్ద సంఖ్యలో చెరువులోకి చేర్చి గ్రావెల్‌ను లూటీ చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు.

అనంతసాగరం మండలంలో..

సోమశిల: మండల పరిధిలోని కొత్తపల్లి సమీపంలో ఉన్న తిప్ప పట్టా పొలం నుంచి కచిరిదేవరాయపల్లి గ్రామానికి మంగళవారం పట్టపగలే మూడు టిప్పర్లు, ఒక పెద్ద కంటైనర్‌తో మట్టిని తరలించారు. అయినా మండల రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ వీర వసంతరావును సంప్రదించగా, పట్టా పొలాల నుంచి తోలుతుంటే తమకు సంబంధం లేదని, వీటికి అనుమతులు తమ పరిధిలో ఇవ్వడం లేదని, దీన్ని మైనింగ్ శాఖ అధికారులే చూసుకుంటారని బదులిచ్చారు.





రోగులకు ఎన్నాళ్లీ అవస్థలు

నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకునేందుకు వచ్చిన రోగులు సరైన సదుపాయాల్లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. నడవలేని బాధితులు డాక్టర్ దగ్గరికి వెళ్లేందుకు వీల్ చైర్లు కూడా అందుబాటులో లేవు. మరోవైపు వివిధ పరీక్షలు చేయించుకునేందుకు పేషెంట్లకు సాయంగా ఉండాల్సిన అటెండర్లు లేరు. దీంతో స్ట్రెచర్లపై పేషెంట్ బంధువులే ఆక్సిజన్ సిలిండర్లు పట్టుకొని తీసుకెళ్లాల్సి వస్తోంది. జీజీహెచ్‌లో మంగళవారం కనిపించిన దృశ్యాలివి. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

బాధితులను ఆదుకోవడంలో సర్కార్ విఫలం

- అధికారులపై నెపం మోపడం సిగ్గుచేటు
- సీఎం చంద్రబాబుపై మండిపడిన మాజీ మంత్రి కాకాణి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని, ఆపత్కాలంలో గతంలో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చూపిన చొరవను అక్కడి వారు ప్రశంసిస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పిచ్చిపట్టినట్లు మాట్లాడటం మినహా, బాధితులకు ఎలాంటి భరోసాను సీఎం చంద్రబాబు ఇవ్వలేకపోతున్నారని ఆరోపించారు.

అధికారులపై నెపమా..?

బాధితులకు సాయం చేయడం చేతకాక ఆ నెపాన్ని ఐఏఎస్, ఐపీఎస్‌లపై మోపడం సిగ్గుచేటని విమర్శించారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఉన్నతాధికారులపై విమర్శలు చేయడం శోచనీయమన్నారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు అనేక తప్పులు చేసి ఉంటారని.. వీటిపై విచారణ జరిపి ఆధారాలు సేకరించడమేనా అధికారులు చేసిన తప్పిదమని ప్రశ్నించారు. అధికారులపై బురదజల్లేందుకు యత్నించడం సరికాదని హితవు పలికారు. ఈ ఘటనపై ఎల్లో మీడియా హడావుడి మరింత విడ్డూరమన్నారు.

'ఆమె'పై ఉన్న శ్రద్ధ.. వరదపై ఏదీ..?

భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ మూడు రోజుల ముందే హెచ్చరించినా, చంద్రబాబు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. కాదంబరి జెత్వానీని ప్రత్యేక విమానంలో తీసుకొచ్చి ముగ్గురు ఐపీఎస్‌లను ఇబ్బంది పెట్టడంలో చూపిన శ్రద్ధను ఈ వ్యవహారంలో ఎందుకు చూపలేదని ప్రశ్నించారు. డ్రామాలేయాలనే ఉద్దేశంతో నీటిలోకి చంద్రబాబు వచ్చారని మండిపడ్డారు. చంద్రబాబుకు జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకంగా నిలుస్తున్నారని చెప్పారు. రేషన్ వాహనాలను పక్కనబెట్టిన ప్రభుత్వం ఇప్పుడు వాటి ద్వారానే బాధితులకు సేవలందిస్తోందనే అంశాన్ని ప్రస్తావించారు. ఫొటోలకు పోజులివ్వడం మినహా అచ్చెన్నాయుడు, లోకేశ్ చేసిందేమీలేదని దుయ్యబట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్కడున్నారని ప్రశ్నించారు.

జగన్‌పై విమర్శలు సిగ్గుచేటు

వరద బాధితులకు భరోసా కల్పించేందుకు వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు విమర్శలు చేయడం సిగ్గుచేటని చెప్పారు. విజయవాడలో రిటైనింగ్ వాల్‌ను గత ప్రభుత్వ హయాంలో నిర్మించారని, దీంతో జగన్‌మోహన్‌రెడ్డికి అక్కడి ప్రజలు అండగా ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వరదలొచ్చిన సమయంలో సమర్థంగా ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. గోదావరి పుష్కరాల సమయంలో ఎంతో మందిని చంద్రబాబు పొట్టనబెట్టుకున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడాన్ని మాని బాధితులకు సాయం చేయాలని హితవు పలికారు.

ఏడేళ్ల బాలుడికి అరుదైన సర్జరీలు



చిన్నారి వరుణ్‌తో డాక్టర్ మస్తాన్‌బాషా తదితరులు

- ప్రాణం పోసిన పెద్దాస్పత్రి డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): ఒకచోట కాదు.. రెండుచోట్ల కాదు.. ఏకంగా ఐదు చోట్ల చేతులు, కాళ్లు విరిగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఏడేళ్ల బాలుడికి డాక్టర్లు శస్త్రచికిత్సలు చేసి ప్రాణాలు కాపాడిన ఘటన నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో చోటు చేసుకుంది. వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందుతో కలిసి ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ మస్తాన్‌బాషా మంగళవారం వివరించారు. నెల్లూరుకు సమీపంలోని రాముడుపాళెంలో రొయ్యలగుంట వద్ద చెంబేటి నాగరాజు, అనిత దంపతులు కాపలాగా ఉంటున్నారు. గత నెల 8న వీరి ఏడేళ్ల కుమారుడు వరుణ్ చాప నెత్తిన పెట్టుకొని ఆడుకుంటూ పొరపాటున రొయ్యలగుంటలో తిరుగుతున్న ఏరేటర్‌పై పడిపోయాడు. చాపతో సహా ఆ బిడ్డ రోలింగ్‌పై తిరగసాగాడు. సమీపంలో ఉన్న వారు ఫ్యాన్ స్విచ్ఛాఫ్ చేసి ఏరేటర్‌కు చుట్టుకుపోయిన బాలుడ్ని బయటకు తీశారు. బాలుడ్ని నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రుల వద్దకు తల్లిదండ్రులు తీసుకొచ్చారు. అయితే అనేక చోట్ల ఎముకలు విరిగిపోయి, అంతర్గతంగా రక్తస్రావమై ఉండటంతో ఎవరూ చేర్చుకోలేదు. దీంతో బిడ్డను పెద్దాస్పత్రికి తీసుకొచ్చారు. వీరికి ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డుల్లేవు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బిడ్డను ఆర్థోపెడిక్ డాక్టర్ మస్తాన్‌బాషా పరిశీలించి పరీక్షలు చేయగా, రెండు చేతులతో పాటు, రెండు కాళ్లు ఐదుచోట్ల విరిగిపోయి ఉండటాన్ని గమనించారు. ఐదు గంటలకు ఆస్పత్రికి రాగా, కేవలం రెండు గంటల్లోనే 20 మంది డాక్టర్లు, సిబ్బందితో ఐదు గంటలు కష్టపడి ఆ బిడ్డకు ఆపరేషన్‌ను సక్సెస్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కనీసం రూ.ఐదు లక్షల ఖర్చు అయ్యే ఆపరేషన్‌ను రూపాయి ఖర్చు లేకుండా చేశామని మస్తాన్‌బాషా వివరించారు. బాలుడు కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జి చేశారు. తనతో పాటు డాక్టర్లు దివ్య, అనిల్, రాజు తదితరులతో పాటు అనస్థీషియా హెచ్‌ఓడీ శ్రీనివాసరావు, నర్సింగ్ సిబ్బంది తదితర 20 మంది సహకారంతో బిడ్డను కాపాడామన్నారు. ఆపరేషన్‌ను విజయవంతం చేసిన మస్తాన్‌బాషా టీమ్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, ప్రిన్సిపాల్ గోవిందు అభినందించారు. డాక్టర్లకు వరుణ్ తల్లి అనిత, తండ్రి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

దారికాచి దారుణహత్య

- ఆర్థిక విభేదాల నేపథ్యంలో ఘాతుకం
- నిందితుల కోసం పోలీసుల గాలింపు



బాధితులను విచారిస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



రక్తపుమడుగులో పాల్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక విభేదాల నేపథ్యంలో ఓ వ్యక్తిని కొందరు దారికాచి కిరాతకంగా హత్యచేసిన ఘటన ముత్యాలపాళెంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. బోగోలు మండలం చెన్నారాయునిపాళేనికి చెందిన పాల్(37) ఫైనాన్స్, ట్రావెల్స్ నిర్వహిస్తున్నారు. ఆయనకు శైలజ, అన్నమ్మ, కవిత భార్యలు. నగరానికి చెందిన నానీ, చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతానికి చెందిన ప్రభుసాయి మరికొందరితో ఆర్థిక లావాదేవీలతో పాటు మరికొన్ని విషయాల్లో కొంతకాలంగా విభేదాలున్నాయి. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ముత్యాలపాళెంలోని మూడో భార్య కవిత వద్ద పాల్ కొంతకాలంగా ఉంటున్నారు. ఇటీవల పాల్ ఇంట్లో లేని సమయంలో నానీ, ప్రభుసాయి అక్కడికెళ్లి కవితపై చేయిచేసుకోవడంతో పాటు ఆయన్ను చంపేస్తామని బెదిరించి వెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఇరుగాళమ్మ గుడి ప్రాంతానికి చెందిన జయతో సైతం పాల్‌కు ఆర్థిక విషయాల్లో మనస్పర్థలున్నాయి. రామ్మూర్తినగర్‌లోని గంజిఖానా స్కూల్ వద్ద పాల్‌పై జయ, ప్రభసాయి మరికొందరు ఈ నెల ఒకటో తేదీ రాత్రి దాడి చేశారు. ఈ నేపథ్యంలో పని నిమిత్తం ఇంటి నుంచి పాల్ సోమవారం బయటకెళ్లారు. అర్ధరాత్రి దాటాక ఇంటికొస్తాను.. తలుపు తీసి పెట్టాలని భార్యకు ఫోన్ చేసి చెప్పారని తెలిసింది. ఈ తరుణంలో అతని కోసం ఇంటి ముందు వేచిచూడసాగారు. ముత్యాలపాళెంలోని మేరీమాత విగ్రహం వద్దకు బైక్‌పై పాల్ వచ్చేసరికి అప్పటికే ఆటోలో వేచి ఉన్న జయ, మరికొందరు అటకాయించారు. కత్తులు, కర్రలతో దాడిచేసి పాల్‌ను హత్యచేసి పరారయ్యారు. విషయాన్ని గమనించిన కవిత ఇంటి నుంచి పరుగులు తీస్తూ ఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే పాల్ మృతి చెందిఉన్నారు. ఘటన స్థలానికి నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తదితరులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై ఎనిమిది కత్తిపోట్లు, తలపై తీవ్రగాయం ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి హత్యకు దారితీసిన పరిస్థితులను మృతుడి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలోని మరో బృందం నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టింది. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట భద్రత

- ఎస్పీ కృష్ణకాంత్



గణేశ్ ఘాట్‌ను పరిశీలిస్తున్న కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): గణేశ్ విగ్రహ నిమజ్జన కార్యక్రమాలకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. నగరంలోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థాన సమీపంలో గల గణేశ్ ఘాట్‌లో ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. నీటి లోతు, చిన్న, పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రదేశాలు, ప్రవేశం, నిష్క్రమణదారులు, బ్యారికేడింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై సిబ్బందితో చర్చించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా చూడాలని కోరారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు, శాంతి కమిటీలు సహకరించాలని చెప్పారు. నిర్దేశిత ప్రాంతాలు, సమయాల్లోనే నిమజ్జనాలను పూర్తి చేయాలని సూచించారు.

సింగిల్ విండో అనుమతులు

గణేశ్ మండపాల ఏర్పాటుకు సంబంధించిన అన్ని రకాల అనుమతుల మంజూరుకు సింగిల్ విండో విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. ఉత్సవాలను నిర్వహించాలనుకునే వారు వాట్సాప్ నంబర్ 79950 95800 లేదా ganeshutsav. netలో వివరాలను నమోదు చేసి అనుమతులను పొందవచ్చని చెప్పారు.

వివరాల నమోదు ఇలా..

మండపాలను ఏర్పాటు చేయాలనుకునే కమిటీ సభ్యుల వివరాలు.. ప్రదేశం.. ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది.. విగ్రహంతో పాటు మండపం ఎత్తు.. విగ్రహాన్ని ఏ రోజున ప్రతిష్ఠిస్తారు.. నిమజ్జనాన్ని ఎక్కడ.. ఏ సమయంలో చేస్తారు.. ఏ వాహనంలో తరలిస్తారు.. తదితర వివరాలను ఇందులో నమోదు చేయాలని సూచించారు. అనంతరం దరఖాస్తు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్తుందని, తదుపరి వివిధ శాఖలు బృందంగా ఏర్పడి మండపాన్ని ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించి.. నిబంధనలకు అనుగుణంగా ఉంటే మీ సేవలో చలానా కట్టాల్సి ఉంటుందని వివరించారు. అనంతరం వెబ్‌సైట్‌లో దరఖాస్తుదారుడి ఫోన్ నంబర్‌ను నమోదు చేసి, క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీని పొందవచ్చన్నారు. క్యూఆర్ కోడ్‌ను ల్యామినేషన్ చేసి ఉత్సవ మండపంలో ప్రదర్శించాలని చెప్పారు. ఉత్సవాల పేరిట బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, వెంకటరెడ్డి, రామకృష్ణ, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.